## క్లుప్తంగా

### రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్‌: డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన రెండో రోజూ శనివారం కొనసాగింది. ఉదయం ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరై టీ సమయంలో గ్యారేజీ గేట్‌ ముందు ధర్నా చేశారు. ఈయూ రీజినల్‌ నాయకులు పీఎస్‌ ఖాన్‌, కల్లప్ప, ఖాన్‌ మాట్లాడారు. ఆరేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌ బకాయి ఇవ్వాలని, ఎలక్ట్రికల్‌ బస్సులను ఆర్టీసీ వారే కొనుగోలు చేయాలని, డబుల్‌ డ్యూటీ అమౌంట్‌ పెంచాలని, పెండింగ్‌ డీఈలను ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు ఎస్‌ఎస్‌ వలి, రామలింగ, శ్రీరాములు, బాష, తిప్పారెడ్డి, అరుణ్‌, హిదాయతుల్లా పాల్గొన్నారు.

### బెల్టు దుకాణాలు ఎత్తేయాలి

కుందుర్పి: బెల్టు దుకాణాలు ఎత్తేయాలని ఎంపీపీ కమలమ్మ, వైస్‌ ఎంపీపీ భీమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్‌ తదితరులు డిమాండ్‌ చేశారు. శనివారం వారు మండల వ్యాప్తంగా బెల్టు దుకాణాలు ఎత్తేయాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 197 గ్రామాల్లో ప్రతి పల్లెలోనూ నాలుగు బెల్టు దుకాణాలకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. కనీసం మొహర్రం పండుగ పూర్తయ్యేంత వరకూ గ్రామాల్లో బెల్టు దుకాణాలు మూసివేయాలని ఎక్సైజ్‌ అధికారులను కోరినట్లు తెలిపారు.

### గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని జయప్రదం చేయండి

బొమ్మనహాళ్‌: గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని ఆదివారం జయప్రదం చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ టెక్నికల్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్లు, వైద్య, హౌసింగ్‌ అధికారులతో సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవం సందర్భంగా పంచాయతీల్లో ఆదివారం గ్రామసభలు నిర్వహించి, గ్రామీణాభివృద్ధిపై వివరించాలని ఎంపీడీఓ తెలిపారు. హౌసింగ్‌ ఏఈఈ వాసంతి, పంచాయతీ కార్యదర్శులు శివన్న, ఫక్రుద్దీన్‌, అశోక్‌, పవన్‌ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

విడపనకల్లు: స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వాణిని ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ శ్రీనివాసులు, వాణి సేవలను ఎంఈఓ మల్లికార్జున కొనియాడారు. అనంతరం తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ మండల అధ్యక్షుడు నజీర్‌ అహ్మద్‌, కిశోర్‌, జిల్లా కౌన్సిలర్లు రామాంజనేయులు, కృష్ణ, మునిస్వామి, రామన్న, ఉపాధ్యాయులు మంజుల, సురేఖ, వెంకటస్వామి, జగదీష్‌, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

### ఆలేరి రాజగోపాల్‌రెడ్డికి పరామర్శ



రాజగోపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మెట్టు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌ రెడ్డిని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పరామర్శించారు. వారం క్రితం ఆలేరి రాజగోపాల్‌ రెడ్డి సతీమణి మాజీ సర్పంచ్‌ విజయలక్ష్మీ మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం మెట్టు గోవిందరెడ్డి గరుడచేడు గ్రామంలోని ఆలేరి రాజగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ పాటిల్‌ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్‌ నాగిరెడ్డి, పంచాయతీ రాజ్‌ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన పాల్గొన్నారు.

### సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేయలేదని ఫిర్యాదు

కుందుర్పి: మండల వ్యాప్తంగా విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయలేదని బెస్తరపల్లి, బసాపురం, ఎర్రగుంట, జంబుగుంపల గ్రామాల రైతులు ఏడీఏ యల్లప్పకు శనివారం ఫిర్యాదు చేశారు. కుందుర్పి మండలానికి 4 వేల క్వింటాళ్ల విత్తనం కోసం ప్రతిపాదనలు పంపించారు. నేటికీ సగం మందికి కూడా విత్తన కాయలు అందిన పాపాన పోలేదని రైతులు రామచంద్ర, హనుమంతప్ప, రమేష్‌, గంగాధర తదితరులు తెలిపారు.

# సాయం.. సున్నా



- కూటమి ప్రభుత్వం వచ్చాక ఊసేలేని సున్నావడ్డీ
- ఏటా 29,231 మంది రైతులకు రూ.6.24 కోట్ల నష్టం
- వైఎస్సార్‌సీపీ హయాంలో సక్రమంగా రైతు ఖాతాల్లోకి జమ

రాయదుర్గం: పంటరుణాలపై సున్నా వడ్డీ రాయితీని గత ప్రభుత్వం కంటే మెరుగ్గా అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయినా చెల్లింపుల ఊసే ఎత్తడం లేదు. రైతులకు ఇవ్వాల్సిన వడ్డీ రాయితీ ఈ రెండు సీజన్లలోనే రూ.12.48 కోట్లు బకాయి పేరుకుపోయింది. వడ్డీలు జమ చేస్తేనే బ్యాంకర్లు నవీకరణ పూర్తి చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 29,231 మంది రైతులకు రూ.6.24 కోట్లు సున్నా వడ్డీ రాయితీ నష్టపోవాల్సి వచ్చింది. ఈ మొత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా జూన్‌ ఆఖరిలోపు రైతు ఖాతాల్లోకి జమ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సున్నావడ్డీ పథకం కనుమరుగైంది. ఫలితంగా రైతులపై అదనపు భారం మోపింది.

**అడుగుడుగునా అన్నదాతలకు దగా..**

మరోవైపు ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడడంతో రైతులే ప్రీమియం కట్టుకోవాల్సి వస్తోంది. గడిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా 84,824 మంది రైతులకు రూ.113.24 కోట్ల మొత్తాన్ని మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌ నొక్కి నేరుగా రైతు ఖాతాల్లోకి జమ చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్‌ ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో ఆ భారం మొత్తం రైతులే భరించాల్సి వస్తోంది. రైతుకు పెట్టుబడుల అవసరాల దృష్ట్యా ఏటా రైతు భరోసా పథకం ద్వారా 2,51,142 మంది రైతులకు రూ.327.08 కోట్లు జమ చేశారు. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు సూపర్‌సిక్స్‌ హామీల్లో ప్రకటించారు. ఆ హామీకి నేటికీ దిక్కులేదు. ఇలా అడుగడుగునా అన్నదాతల్ని కూటమి సర్కార్‌ దగాకు గురిచేస్తోంది.

**ఇబ్బందులు పడుతున్నాం**



సున్నా వడ్డీ లేదు, అన్నదాత సుఖీభవ జమకాలేదు. పంట బీమా ప్రీమియం, పంట రుణాలపై తీసుకున్న వడ్డీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సున్నావడ్డీ, బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరించింది. ఏటా రైతు భరోసా ద్వారా రూ.13,500 ఖాతాల్లోకి జమ చేసింది. కూటమి సర్కార్‌ ఆదుకోవాలి. – హనుమంతరెడ్డి, రైతు, పూలకుంట

**రైతులు కోలుకోలేని పరిస్థితి**



పండిన పంటకు గిట్టుబాటు లేదు. అమ్ముకున్న ధాన్యానికి నగదు జమ కాలేదు. ప్రభుత్వ సాయం పెద్దగా కనిపించలేదు. సున్నావడ్డీ వస్తుందో రాదో చెప్పలేదు. భీమా ప్రీమియం భారమైంది. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైన రెండు నెలలు కావొస్తున్నా అన్నదాత సుఖీభవ జమ కాలేదు. ఇలా రైతు అనేక ఇబ్బందుల నడుమ కోలుకోలేని దెబ్బతింటున్నాడు. – రాముడు, రైతు, చెరువుదొడ్డి, గుమ్మఘట్ట మం

### నృసింహుడి పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ రూరల్‌: మండలంలోని పెన్నహోబిలం నృసింహస్వామి పల్లకీ సేవ శనివారం జరిగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక స్నానాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకీలో శ్రీవారి ఉత్సవ మూర్తులను ఉంచి, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులకు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### తాగునీటి పథకం పైపులైన్‌ మరమ్మతు



మారెమ్మగుడి ఏరియాలో నీటి లీకేజీని అరికడుతున్న ఇంజినీరింగ్‌ విభాగం సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్‌..

రాయదుర్గంటౌన్‌: పట్టణంలోని 21వ వార్డు మారెమ్మగుడి ఏరియాలో డిస్ట్రిబ్యూషన్‌ తాగునీటి పైప్‌లైన్‌ లీకేజీని ఇంజనీరింగ్‌ విభాగం అధికారులు అరికట్టారు. దాదాపు నెల రోజుల నుంచి పైప్‌లైన్‌ లీకేజీతో నీరు వృథా అవుతోంది. దీనికితోడు కలుషితమవుతుండేది. కాలనీవాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీరలేదు. ఈనెల 3న 'సాక్షి'లో 'తాగునీటి పైప్‌లైన్‌ లీకేజీ' శీర్షికన వార్త ప్రచురితమైంది.

### వర్షాకాలంలో మొక్కలు నాటాలి

ఉరవకొండ: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని జైకిసాన్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేష్‌ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జైకిసాన్‌ ఫౌండేషన్‌ కార్యాలయం వద్ద ప్రజలకు ఉచిత మొక్కలు పంపిణీ చేశారు.

## పెంచిన విద్యుత్‌ చార్జీలు వెంటనే తగ్గించాలి



కళ్యాణదుర్గం విద్యుత్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఐ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్‌: పెంచిన చార్జీలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్‌ డిమాండ్‌ చేశారు. శనివారం పట్టణంలోని విద్యుత్‌ కార్యాలయం ఎదుట మహిళలతో కలిసి సీపీఐ నాయకులు నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్‌ చార్జీలు తగ్గించి, తక్షణం స్మార్ట్‌ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఏఈ జయకృష్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మహిళలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

**స్మార్ట్‌ మీటర్ల నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**

కణేకల్లు: ఇళ్లకు స్మార్ట్‌ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కణేకల్లు మండల సీపీఐ కార్యదర్శి గౌస్‌ పీర్‌ డిమాండ్‌ చేశారు. శనివారం స్మార్ట్‌ మీటర్లు, విద్యుత్‌ సర్దుబాటు చార్జీల విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ స్థానిక విద్యుత్‌ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ముల్లా సర్మాస్‌వలి, ఏపీ రైతు సంఘం నాయకులు హెచ్‌.ఎస్‌ షఫీ, అహ్మద్‌, దాదాపీర్‌, సీపీఐ కార్యదర్శి నూర్‌, రిజ్వాన్‌, ఆసీఫ్‌, ఎస్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ మండల కార్యదర్శి అబిరాబి, సహాయ కార్యదర్శి సర్మాస్‌బీ, అధ్యక్షురాలు హసీనా పాల్గొన్నారు.

కూడేరు: విద్యుత్‌ చార్జీలు తగ్గించాలని స్థానిక సబ్‌ స్టేషన్‌ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలియజేశారు. విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్లు ఏర్పాటు చేసి, పేదలపై ఆర్థిక భారం మోపుతారా? అని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేశవరెడ్డి , ఏపీ మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్‌ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ట్రాన్స్‌కో అధికారులకు అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, మండల నేతలు నారాయణమ్మ, రమణ, శ్రీరాములు, చిన్న, బీమప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ తప్పనిసరి వేయాలి



ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న స్కూల్‌ ఎడ్యుకేషన్‌ కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్‌: ఉపాధ్యాయులు ఎఫ్‌ఆర్‌ఎస్‌ తప్పని సరిగా వేయాలని కమిషనర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ రాష్ట్ర కమిటీ బృందం సభ్యులు తెలియజేశారు. విద్యార్థుల హాజరు, 5 ప్లస్‌ ఏజ్‌ పిల్లలు ఉన్నా ఎందుకు పాఠశాలలకు రావడం లేదనే అంశాలపై శనివారం రాయదుర్గంలో కమిషనర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ రాష్ట్ర కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. సభ్యుల బృందంలో పరిశీలకులుగా కేవీ మల్లికార్జున, ఏ శ్రీదేవి, వీ.కోటేశ్వరరావులు ఉన్నారు. వీరు తొలుత పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ–2 వెంకటరమేష్‌, సీఆర్‌పీలతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నియోజకవర్గంలోని పాఠశాలలో వాటిలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్యను తెలుసుకున్నారు. అనంతరం 1వ తరగతిలో ప్రవేశాలపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని 74 ఉడేగోళంలోని పాఠశాలను సందర్శించారు. పిల్లల హాజరు కచ్చితంగా వేయాలని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు 9 గంటలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ వేసుకోవాలని, ఒకవేళ సెలవులో ఉంటే కాంప్లెక్స్‌ హెచ్‌ఎంకు, సీఆర్‌ఎంటీకు, ఎంఈఓకు ముందురోజు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. స్పెషల్‌ డ్యూటీ వేసుకున్నట్లయితే అక్కడ ఎఫ్‌ఆర్‌ఎస్‌ వేయాలన్నారు.

### పచ్చని చెట్లను నరికితే చర్యలు

కుందుర్పి: పచ్చని చెట్లు నరికితే చర్యలు తప్పవని జంబుగుంపల, శెట్టూరు అటవీ బీట్‌ అధికారులు పరమేశ్వరప్ప, తిమ్మక్క శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మండలంలో నిబంధనలను అతిక్రమించి, పచ్చని చెట్లను నరుకుతున్నారన్నారు. ఆయా పోలీస్‌ స్టేషన్ల పరిధిలోని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.మొక్కలు పెంచాలే తప్పా పచ్చదనాన్ని నాశనం చేయడం సరికాదన్నారు.

## ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

- రాయదుర్గం జూనియర్‌ సివిల్‌ జడ్జి రమ్య



లోక్‌ అదాలత్‌లో రాజీ మార్గంతో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రమ్య

రాయదుర్గంటౌన్‌: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని రాయదుర్గం జూనియర్‌ సివిల్‌ జడ్జి రమ్య, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్‌ తెలిపారు. చిన్నపాటి గొడవలు, సమస్యలతో కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ తిరిగి సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. లోక్‌ అదాలత్‌లో కేసుల పరిష్కరించుకుంటే ఇరువర్గాలు విజయం సాధించినట్లేనన్నారు. శనివారం కోర్టులో జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించారు. రాజీకి ఆమోదయోగ్యమైన మొత్తం 176 కేసులను పరిష్కరించి ఇరువర్గాల మధ్య రాజీ కుదుర్చినట్లు చెప్పారు. ఇరువర్గాలు విశాల దృక్పథంతో ఆలోచిస్తే కేసుల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నాటుసారాతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ జిల్లా డిప్యూటీ కమిషనర్‌ నాగమద్దయ్య

బొమ్మనహాళ్‌ (బెళుగుప్ప): నాటు సారాతో జీవితాలు నాశనమవుతాయని ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్‌ నాగమద్దయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీశాంతి ధామంలో నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా , డివిజన్‌ స్థాయి అధికారులతో కలిసి డిప్యూటీ కమిషనర్‌ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమంతో నాటుసారా నిర్మూలనకు చర్యలు చేపట్టిందన్నారు. నాటుసారాతో అనారోగ్యం బారిన పడి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే అవకాశం ఉందన్నారు. నాటుసారా క్రయ విక్రయాలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సూపరింటెండెంట్‌ రామ్‌మోహన్‌రెడ్డి, అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ శ్రీరామ్‌, సీఐలు జయనాథ్‌రెడ్డి, సోమశేఖర్‌, ఎస్‌ఐ సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

## 8 నుంచి రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం రూరల్‌: వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు రీకాలింగ్‌ చంద్రబాబూస్‌ మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా (చంద్రబాబు మేనిఫెస్టో)ను గుర్తుకు తెస్తూ నియోజవర్గ వ్యాప్తంగా తలారి రంగయ్య పర్యటించనున్నారు. 8న ఉదయం 10 గంటలకు బ్రహ్మసముద్రం మండలం, 9న ఉదయం 10 గంటలకు కుందిర్పి మండలం, మధ్యాహ్నం 3.30 గంటలకు కంబదూరు మండలం, 10న ఉదయం శెట్టూరు మండలం, మధ్యాహ్నం 3 గంటలకు కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, రూరల్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తలారి రంగయ్య పిలునిచ్చారు.

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



ఎడ్యుకేషనల్‌ రాష్ట్ర కమిటీ సభ్యులకు సమస్యను వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ

రాయదుర్గంటౌన్‌: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు తక్షణమే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ డిమాండ్‌ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 350 పోస్టులు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. ఇలా అయితే విద్యార్థులకు నాణ్యమైన చదువు ఎలా అందుతుందన్నారు. డి.హీరేహాళ్‌ మండలం మలపనగుడి పాఠశాల, పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ఉర్దూ పాఠశాలలకు తక్షణం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఈ మేరకు ఆయన శనివారం రాయదుర్గం పర్యటనకు వచ్చిన ఎడ్యుకేషనల్‌ రాష్ట్ర కమిటీ పరిశీలకుల బృందానికి వినతి పత్రం అందించారు.

## భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



వజ్రకరూరులో అలంకరణలో కటికెలస్వామి



ఎనుములదొడ్డిలో కుళ్లాయిస్వామి గ్రామోత్సవం



కూడేరులో అలంకరణలో పీర్ల దేవుళ్లు

ఉరవకొండ: మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన నాల్గో వార్డు లాల్‌స్వామి పీర్లు, గాంధీచౌక్‌ వద్ద ఉన్న పెద్ద వన్నూరు స్వామి , చిన్న వన్నూరు స్వామి, డ్రైవర్స్‌ కాలనీలోని లాల్‌స్వామి పీర్ల చావిడికి భక్తులు పోటెత్తారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పానకాలు భారీ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భక్తులు తమ కోర్కెలు తీర్చుకోవడానికి స్వామి చక్కెర, బెల్లం అందించి, మొక్కులు తీర్చుకున్నారు. లాల్‌స్వామి పీర్లలకు చక్కర, బెల్లం తులాభారం భక్తులు వేయించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వారి అగ్నిగుండ ప్రవేశంతో పాటు జలధి కార్యక్రమం జరగనుంది.

**కూడేరులో భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు**

కూడేరు: కూడేరులో మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం చిన్న సరిగెత్తును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద వన్నూరుస్వామి, చిన్న వన్నూరుస్వామి, పెద్దలాల్‌, చిన్నలాల్‌, బొడ్డు, మౌళాలి, కుళ్లాయి స్వామి పీర్లకు ముజావార్‌ మైనుద్దీన్‌ ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేకంగా చదివింపులు చేశారు. పీర్ల దేవుళ్లను పీర్ల చావిడి నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. సోమవారం పెద్ద సరిగెత్తు మంగళవారం జలధి కార్యక్రమం ఉంటుందని ముజావార్‌ మైనుద్దీన్‌ తెలిపారు.

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి, రుద్రంపల్లి, తెనగల్లు, మలయనూరు, ఓబుగానిపల్లి తదితర గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం రాత్రి ఆయా గ్రామాల్లో పానకం కడవలతో వచ్చి పీర్లకు చక్కెరతో కుళ్లాయిస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అన్ని పీర్లు ఎనుములదొడ్డిలో ఒకే చోట కలుస్తాయి.

వజ్రకరూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలు జరుగుతున్నాయి. శనివారం పెద్ద సరిగెత్తు వైభవంగా జరిగింది. గ్రామాల్లోని పీర్ల చావడిలలో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. మండల కేంద్రం వజ్రకరూరులోని లాలుస్వామి, కటికెల స్వామి, తల్లిపీరా పీర్ల చావడిల్లో పెద్ద సరిగెత్తు నిర్వహించారు.

## 'మధ్యాహ్న భోజనం' పక్కాగా అమలు చేయాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ తిమ్మప్ప

వజ్రకరూరు: మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ తిమ్మప్ప ఆదేశించారు. శని వారం మండల పరిధిలోని చాబాల జెడ్పీహెచ్‌ఎస్‌ను ఎంఈఓ సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థుల కోసం వండుతున్న ఆహారం పాదార్థాలను పరిశీలించారు. అనంతరం రాధాకృష్ణన్‌ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ తిమ్మప్ప మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం బసవలింగ ప్రసాద్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి**

బొమ్మనహాళ్‌: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌ సూచించారు. శనివారం మండలంలోని కురువల్లి, చంద్రగిరి గ్రామాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు పంపించాలన్నారు.

**పీర్లగుండంలోకి ఎండిన మొద్దులు వేద్దాం**

కూడేరు: పీర్ల గుండంలోకి ఎండిన మొద్దులు వేద్దామని జాగృతి ఫౌండేషన్‌ ప్రతినిధి పురుషోత్తం పిలుపునిచ్చారు. శనివారం కూడేరులో జాగృతి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలను చైతన్య పరిచారు. ఫౌండేషన్‌ ప్రతినిధి పురుషోత్తం మాట్లాడారు. ఇప్పటికే వాతావరణం కలుషితమై జీవరాశులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

**విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ ప్రారంభోత్సవం**

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33–11కేవీ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ను మంత్రి పయ్యావుల కేశవ్‌ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్‌ శాఖాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం**

ఉరవకొండ రూరల్‌: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ ప్రాంగణం పరిధిలోని ఖాళీ స్థలాల లీజుకు షీల్డ్‌ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఎం హంపన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లీజు పరిమితి కాలం 15 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. టెండర్‌ దరఖాస్తు ఫారాలను ఏపీఎస్‌ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఈనెల 10 వరకూ పొందొచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11 న మధ్యాహ్నం 2 గంటల లోపు కడప ఆర్టీసీ కార్యాలయంలో షీల్డ్‌ టెండర్‌ బాక్స్‌లో వేయాలని తెలిపారు.

**వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలి**

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ మహబూబ్‌ బాషా సిబ్బందికి ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో రేషన్‌ కార్డుదారులందరికీ రేషన్‌ సరకులను డీలర్లు అందించేలా చర్యలు చేపట్టాలని సీఎస్‌డీటీ శాంతకుమారికి సూచించారు. డీటీ ఉదయ్‌ భాస్కర్‌, రీసర్వే డీటీ ప్రసాద్‌, సర్వేయర్‌ అయేషా సిద్ధికీ, సీఎస్‌డీటీ శాంతకుమారి, ఆర్‌ఐ విజయ భాస్కర్‌ రెడ్డి పాల్గొన్నారు.

**చాబాల హెచ్‌డబ్ల్యూఓగా శివరామిరెడ్డి**

వజ్రకరూరు: మండలంలోని చాబాల సాంఘిక సంక్షేమ బాలు రవసతి గృహం హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ (వార్డెన్‌)గా ఎల్‌.శివరామిరెడ్డి నియమితులయ్యారు. తాడిమర్రి మండలంలో హాస్టల్‌ వార్డెన్‌ ఎల్‌.శివరామిరెడ్డి బదిలీలో భాగంగా వజ్రకరూరు మండలం చాబాల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం వార్డెన్‌గా నియమితులయ్యారు. శనివారం చాబాల హాస్టల్‌లో శివరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

**ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్‌ నిషేధం**

ఉరవకొండ రూరల్‌ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో ప్లాస్టిక్‌ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆలయ ఈవో రమేష్‌ బాబు శనివారం తెలిపారు. పెన్నహోబిలంలో నిర్వహిస్తున్న హోటళ్లు, కూల్‌ డ్రింక్స్‌ షాపులు, కిరాణా దుకాణదారులు ఈ నియమాలను పాటించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో మత్తు పదార్థాలు, మద్యం అమ్మకాలు చేస్తే వారి షాపులను రద్దు చేసి, జరిమానా విధించటం జరుగుతుందని తెలిపారు.